## ఉపాధ్యాయుడైన అదనపు కలెక్టర్



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న అదనపు కలెక్టర్

మరికల్, డిసెంబర్ 18: ప్రాథమిక స్థాయిలో విద్యాబోధన మెరుగ్గా ఉండాలని నారాయణ పేట అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ అన్నారు. సోమవారం మండలంలోని పెద్దచింతకుంట, పూసల్‌పాడ్ ప్రాథమికోన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొంతసేపు ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు బోధించాలని, ఒకటికి రెండుసార్లు ప్రతి విద్యార్థికి పాఠాలు రాయడం, చదవడం నేర్పించాలని సూచించారు. పెద్దచింతకుంటలో నూతనంగా నిర్మిస్తున్న పంచాయతీ భవన నిర్మాణం పనులను పరిశీలించారు. పనులు తర్వగా పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి విరాళం

వనపర్తి టౌన్, డిసెంబర్ 18: జిల్లా కేంద్రంలోని 1వ వార్డులో నిర్మించ తలపెట్టిన దుర్గామాత ఆలయ నిర్మాణానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి రూ.2లక్షల విరాళాన్ని మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటీ శ్రీధర్ ద్వారా కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆలయ నిర్మాణానికి రూ.2లక్షల విరాళం అందజేయడం సంతోషంగా ఉందని, ఆయనకు ఎల్లప్పుడు దుర్గామాత ఆశీస్సులు ఉండాలని వారు కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, మహేశ్, మార్కెట్ చైర్మన్ రమేశ్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ శారదమ్మ, గిరి, వార్డు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## సర్వే దరఖాస్తులను పరిష్కరించాలి

వనపర్తి, డిసెంబర్ 18: జిల్లాలోని ఆయా మండలాల నుంచి సర్వేకోసం వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా సర్వే అధికారి శ్రీరాం ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సర్వే భూ కొలతల కార్యాలయంలో ఆయా మండలాల సర్వేయర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భాగపరిష్కార భూమి కొలతల విషయంలో ఆ సర్వేనెంబర్ల పట్టాదారుల ఆమోదం తీసుకోవాలని తెలిపారు. కలెక్టరేట్ నుంచి వచ్చిన జీబీసెల్ దరఖాస్తులను అన్నింటిని కూడా ఈ నెలలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లాలోని ఆయా మండలాల సర్వేయర్లు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## ఉరేసుకొని బాలిక ఆత్మహత్య

మద్దూర్(కొత్తపల్లి), డిసెంబర్18: బాలిక ఉరేసుకొని మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకున్నది. ఎస్సై సురేశ్ కథనం ప్రకారం.. మద్దూర్‌కు చెందిన గొల్ల రాములు భార్య శ్యామలమ్మకు ఇద్దరు అమ్మాయిలు, కుమారుడు ఉన్నారు. మొదటి అమ్మాయికి వివాహమైంది. రెండో కూతురు ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నది. తల్లి శ్యామలమ్మ 2నెలల కిందట మృతిచెందింది. తల్లి మృతిని జీర్ణించుకోలేక రెండో కూతురు రాధిక (16)తల్లి లేదని మనస్తాపానికి గురై ఆదివారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రించిన తర్వాత దులానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. నాన్నమ్మ గమనించి తండ్రి రాములుకు తెలుపగా.. వెంటనే చుట్టుపక్కల వారి సహాయంతో కిందికి తీయగా అప్పటికే మృతిచెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## అభ్యాసన కృత్యాలను పెంపొందించాలి

మక్తల్ టౌన్, డిసెంబర్ 18: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థిలో అభ్యాసన కృత్యాలను పెంపొందించాలని ఎంఈవో వెంకటయ్య పేర్కొన్నారు. ఎఫ్ఎల్ఎన్ తరగతుల పరిశీలనలో భాగంగా సోమవారం మక్తల్ మున్సిపాలిటీలోని మండల ప్రజా పరిషత్ పాఠశాల జీపీలో విద్యాధికారి తరగతులను పరిశీలించి విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను నిశితంగా పరిశీలించారు.తెలంగాణ విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ బడుల బలాపేతానికి కృషి చేస్తుందని, ఉపాధ్యాయులు ప్రతివిద్యార్థికి చదవడం, రాయడం, అనర్గళంగా పదాలను పలికే విధంగా తయారు చేయాలని సూచించారు.

## కోరం లేక మండలసభ వాయిదా

అమరచింత, డిసెంబర్ 18: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ మాలతి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదాపడిందని ఎంపీడీవో జ్యోతిఫరూసియా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలో మొత్తం ఆరుగురు ఎంపీటీసీలు ఉండగా అందులో కనీసం ముగ్గురు సభ్యులైనా మండల సమావేశానికి హాజరైతే సమావేశం నిర్వహించే వారమని, మస్తీపూర్ ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డితోపాటు కొంకనోనిపల్లి ఎంపీటీసీ శకుంతలమ్మ మాత్రమే హాజరు కావడంతో సభ నిర్వహణకు తగ్గ కోరం లేకపోవడంతో సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. మళ్లీ సర్వసభ్య సమావేశం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని ఎంపీడీవో తెలిపారు.

# వ్యక్తిగతధూ షణలతో పాలనచే యలేరు

- **వనపర్తి ధ్వంసం కాదు.. నవ నిర్మాణం జరిగింది**
- **100రోజుల్లో నిరూపణ చేయకుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి**
- **బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్**



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్

వనపర్తి, డిసెంబర్ 18: ఆరునెలలుగా ప్రస్తుత ఎమ్మెల్యే మేఘారెడ్డి వ్యక్తిగత ధూషణలతో ఒక్కటే మాట్లాడుతున్నారు, వనపర్తి అభివృద్ధి ఏమీ చేస్తారో ప్రజలకు వివరించే ఆలోచన లేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ ఎద్దేవా చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పట్టణ బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రస్తుత ఎమ్మెల్యే మాట్లాడుతున్న మాటతీరుపై గట్టుయాదవ్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధిని మరిచి ఒక్కటే పనిగా ఎక్కడ మీటింగ్ పెట్టినా అదేపనిగా మాట్లాడడం మానుకోవాలని సూచించారు. వనపర్తిని ధ్వంసం చేశారని, ఆత్మగౌరవమని, ఏదేదో ఎవరో రాసిచ్చిన స్క్రిప్టును అరిగిపోయిన రికార్డు మాదిరిగా మాట్లాడుతున్నరన్నారు. మాజీ మంత్రి ధ్వంసం చేయడం కాదు.. వనపర్తి నియోజకవర్గాన్ని నవ నిర్మాణం చేశారన్నారు. అసలు ఆత్మ గౌరవం అంటే మీకు తెలుసా.. అది మీకు ఉందా అని ప్రశ్నించారు. నిరంజన్‌రెడ్డి నికార్సయిన ఉద్యమకారుడిగా 14 ఏండ్లు పోరాటాలు చేసి ఒకరితో చేయి చాపకుండా న్యాయవాద వృత్తిలో కీర్తి ప్రతిష్టలతో మంత్రిగా ఎదిగారన్నారు. నీలాగా కాలు మొక్కి ఎంపీపీ పదవీ తీసుకొని అన్నం పెట్టిన వారికి సున్నం పెట్టే మీరా మాట్లాడేది అన్నారు. గతంలో నిరంజన్‌రెడ్డి వెంట ఉన్నప్పుడు ఆయనతో కలిసి పనిచేసి డబ్బులు సంపాదించినప్పుడు ఎక్కడా గుర్తుకు రాలేదు అవినీతి అన్నారు. నీ జీవితంలో నీతో పనిచేసిన కాంట్రాక్టర్లకు డబ్బులు ఎగ్గొట్టి మోసం చేయడం నీ నైజం అన్నారు. నీవు ఓ ఉద్యమనాయకుడివని, ప్రజాసేవకుడవని ప్రజలు నిన్ను గెలిపించలే.. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత ఆరు గ్యారెంటీలకు ప్రజలు మోసపోయిన దానిలో నిన్ను గెలిపించారు తప్పా వేరే ఏమీ నీ గొప్పతనం లేదన్నారు. ఈ వందరోజుల్లో నీ గొప్పతనం, నీ పార్టీ గొప్పతనం ఏందో ప్రజలకు అర్థమయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం కాదు ప్రజా భవన్ అన్నావు.. కానీ ఎన్నికల తర్వాత ప్రజా సమస్యలను పక్కన పెట్టి ఓడిపోయిన వ్యక్తులపై అహంకారపూరిత మాటలు మాట్లాడుతున్నావన్నారు. 30ఏండ్ల కింద నీ జీవిత ప్రస్థానం ఎక్కడ ఉందో ప్రజలకు తెలుసునన్నారు. కాంగ్రెస్ పార్టీలో సభ్యత్వం లేదు, మాజీ మంత్రి చిన్నారెడ్డి అంటే కనీస గౌరవంలేదు, మీ పార్టీ సీనియర్ నాయకులను పట్టించుకొనే సోయి లేదు.. మీకు ఒక్కటే నిరంజన్‌రెడ్డిపై వ్యక్తిగత దూషణలతో కాలం వెలబుచ్చుతున్నావన్నారు. మీరన్నట్టే మా నాయకుడిపై చేస్తున్న ఆరోపణలను 100 రోజుల్లో నిరూపణ చేయలేకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆ రోజు నల్ల చెరువు కాంట్రాక్టర్‌గా నీవు రూ.8కోట్ల పనులకు రూ.11కోట్లు ఎత్తినవు, నల్ల చెరువు కట్టకు మట్టిని ఎక్కడి నుంచి తీసుకొచ్చావో ప్రజలకు తెలపాలని, అలాగే బుద్దారం లెఫ్ట్, రైట్ కెనాల్‌కు రూ.200కోట్లు అయితే దానిని రూ.60కోట్లకు ఎందుకు పెంచావో చెప్పాలన్నారు. మాజీ మంత్రి దగ్గర ఉండి అన్ని పనులు చేసి తిని, ఇప్పుడు తిన్నంటి వాసాలు లెక్క పెడుతున్నావని ఆరోపించారు. ప్రోటోకాల్ ప్రకారంగా క్యాంప్ కార్యాలయం ప్రారంభం చేసినప్పుడు అధికారులు ఎక్కడ ఉన్నారు. సంస్కారం లేకుండా మాట్లాడుతుంది మీరు. మేము కాదు విద్యలేదని మేము ఏనాడు అనలేదు.. విజ్ఞానం లేదని అంటున్నామని తెలిపారు. గతంలో పని చేసిన ఎమ్మెల్యే, మంత్రుల కన్నా మెరుగైన అభివృద్ధి చేసి మన్ననలు పొందాలి కానీ మీరు ఏమీ చేస్తున్నారో ఒక్కసారి ఆలోచించుకోవాలి.. అహంకారంగా మా ట్లాడుతుంది మీరన్నారు. అభివృద్ధి విషయంలో పోటీ పడి పనిచేయండన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, కంచె రవి, మహేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో కీలక పాత్రప్రజా ప్రతినిధులదే..

- **జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి**



పెద్దమందడి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

గోపాల్‌పేట/ పెద్దమందడి, డిసెంబర్ 18: అభివృద్ధిలో కీలక పాత్ర ప్రజాప్రతినిధులు, అధికారులదేనని జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీపీ అడ్డాకుల సంధ్య అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ముఖ్య అథితులుగా వీరు హాజరయ్యారు. ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికను అధికారులు సభలో చదివి వినిపించారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో హుస్సేనప్ప, తాసీల్దార్ శ్రీనివాసులు, సింగిల్ విండో చైర్మన్ రఘుయాదవ్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.అలాగే పెద్దమందడి ఎంపీపీ రఘుప్రసాద్ అధ్యక్షతన మండల సర్వసర సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే మేఘారెడ్డి, జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, ఎంపీడీవో అఫ్జల్, తాసీల్దార్ కిషన్ పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించాలి

నారాయణపేట టౌన్, డిసెంబర్ 18: జిల్లాలో ఇటుక బట్టీల యజమానులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇటుక బట్టీల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. చట్టాలు, నిబంధనలకు విరుద్ధంగా బట్టీలు నడిపితే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటుక బట్టీల ఏర్పాటు, నిర్వహణకు సంబంధించి పాటించాల్సిన నియమాలను వివరించారు. కార్యక్రమంలో కార్మిక శాఖ అధికారి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

***ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచరాదు***

ప్రజావాణిలో ప్రజలు అందించిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచరాదని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో నేరుగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను ప్రజలకు వివరిస్తూ ఆర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బాధితులకు న్యాయం చేయాలి

నారాయణపేట, డిసెంబర్ 18: బాధితులు తీసుకొచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా వాటిని చట్టప్రకారం పరిష్కరించి సత్వరమే న్యాయం చేయాలని ఎస్పీ యోగేశ్ గౌతమ్ అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 4 ఫిర్యాదులు అందాయి. బాధితుల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ చట్ట ప్రకారం పరిశీలించి పరిష్కరించాలని సీఐ, ఎస్సైలకు ఫోన్‌లో ఆదేశించారు.

***మహిళల భద్రత కోసం షీటీమ్స్***

మహిళల భద్రత కోసం షీటీమ్స్ పని చేస్తున్నాయని షీ టీమ్స్ ఏఎస్సై శ్రీదేవి అన్నారు. సోమవారం పట్టణంలోని శివాజీనగర్ ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాల్యవివాహాలు, ఈవ్ టీజింగ్, ఫోక్సో యాక్ట్, సైబర్ నేరాలు, గృహహింస, షీటీమ్స్ భరోసా సెంటర్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీటీమ్ పోలీసులు బాలరాజు, సమీన తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలపై స్పందించాలి

వనపర్తి,డిసెంబర్ 18: ప్రజావాణిలో వచ్చే ప్రజా సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని లోకల్ బాడీ అదనపు కలెక్టర్ సంచిత్ గాంగ్వార్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలతో ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. అంతకుముందు నూతనంగా బాధ్యతలు చేపట్టిన లోకల్ బాడీ అదనపు కలెక్టర్‌కు ఆయా శాఖల అధికారులు మొక్కను అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

నారాయణపేట టౌన్, డిసెంబర్ 18: విద్యార్థులు చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలని డీడబ్ల్యూవో వేణుగోపాల్ అన్నారు. సోమవారం పట్టణంలోని మినీ సేడియంలో రాష్ట్ర, జాతీయ స్థాయి అథ్లెటిక్స్, క్రాస్ కంట్రీ ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అండర్-14, 16లో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 23న కామారెడ్డిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలియజేశారు. అదేవిధంగా క్రాస్ కంట్రీలో ఎంపికైన క్రీడాకారులు జనవరి 19న గుజరాత్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో వాలీబాల్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చిన్నవీరయ్య, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నర్సింహులు, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు నందూనామాజీ, ప్రధాన కార్యదర్శి రమణ, ఖేలో ఇండియా అథ్లెటిక్స్ కోచ్ హరికాదేవి, కోచ్‌లు జగదీశ్, రాజు, రాధిక, సవిత పాల్గొన్నారు.

## చిత్తశుద్ధితో పనిచేస్తుంది

వనపర్తి టౌన్, డిసెంబర్ 18: ప్రజల సంరక్షణ, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎస్పీ రక్షిత కృష్ణమూర్తి అన్నారు. సోమవారం పోలీస్ కార్యాలయంలో పోలీస్ ప్రజావాణి నిర్వహించారు. ప్రజాణిలో 10 ఫిర్యాదులు అందాయని వాటిలో భూతగాదాలు 3, పరస్పర గొడవలు 6, భార్యాభర్తలకు సంబంధించి ఒక ఫిర్యాదు అందాయన్నారు.

## టీజీజేఎల్ఏ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవం

శ్రీరంగాపురం, డిసెంబర్ 18: హైదరాబాద్‌లో ఆదివారం టీచర్స్ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీరంగాపురం జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కురుమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## కరాటేలో విద్యార్థి ప్రతిభ

దామరగిద్ద, డిసెంబర్ 18: మండలం కేంద్రానికి చెందిన పుట్టి మణికంఠ ఆదివారం జడ్చర్లలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలో ఉత్తమ ప్రతిభ కనబర్చి మూడో స్థానంలో నిలిచాడు. మణికంఠ దామరగిద్ద జెడ్పీహెచ్ఎస్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో రాష్ట్రస్థాయిలో పాల్గొని మూడో స్థానం సాధించినందుకు అభినందనలు తెలిపారు.